

రైలు కూత వినపడలే!


- ఉమ్మడి జిల్లాలో పలు రైల్వే ప్రాజెక్టులు పెండింగ్
- ఏపీకి నిధులు ఇస్తామని ఒకే ఒక ప్రకటన
- జిల్లాల వారీగా కేటాయింపుల్లేవ్
- ఆశగా ఎదురుచూస్తున్న ప్రజానీకం
- ప్రాజెక్టులు వస్తాయంటున్న పురందేశ్వరి

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కేంద్ర బడ్జెట్‌లో 'తూర్పు' రైలు కూత మోత మోగిందా? లేదా? అని గోదారోళ్లలో సంశయం పరుగులు పెడుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌కి సమర్పించిన బడ్జెట్‌లో ఏనాటి నుంచో కొట్టుమిట్టాడుతున్న రైల్వే ప్రాజెక్టుల ఊసే లేకపోవడంపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఏపీలో రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలెప్‌మెంట్ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటనతో ఆశలు చిగురిస్తున్నాయి. అన్నింటినీ కేంద్ర రైల్వే మంత్రికి విన్నవించామని.. దాదాపుగా అన్నీ సాకారమైనట్లేనని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి చెబుతున్నారు. ఇదిలా ఉండగా స్పష్టమైన ఆదేశాలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. కొవ్వూరు-భద్రాచలం రోడ్ రైల్వే లైను ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది.నిడదవోలు జంక్షను అభివృద్ధిపై ఇంకా ఏ కబురూ లేదు. కోటిపల్లికి రైలు సదుపాయం ఎప్పటికో తెలియడం లేదు. రోడ్ కం రైలు బ్రిడ్జిపై రైళ్ల ట్రాఫిక్ పెరగడంతో ఆ వైబ్రేషన్స్‌కి రోడ్డు తరచుగా మరమ్మతులకు గురవుతోంది. దీంతో రైళ్లకు మూడో బ్రిడ్జి అవసరం ఏర్పడింది. రాజమండ్రిలో ఆర్చ్ బ్రిడ్జిపై మరో వంతెనను రూ.100కోట్లతో నిర్మిస్తామని చెప్పి ఏళ్లు గడుస్తున్నా అడుగు ముందడుగు పడలేదు. ఆర్చ్ బ్రిడ్జి నిర్మించినపుడే మరో వంతెన నిర్మాణానికి అనువుగా స్పాన్ల(స్తంభాలు) ను నిర్మించారు. అందువల్ల ట్రాక్ వేస్తే సరిపోతుంది.కానీ మూడో వంతెన దిశగా ఎలాంటి చర్యలూ లేవు. కొన్ని నెలల కిందట ప్రవేశపెట్టిన రైల్వే మధ్యంతర బడ్జెట్‌లో కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైనుకు రూ.300 కోట్లను కేంద్రం కేటాయించింది. ఈసారి బడ్జెట్‌లో ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై స్పష్టత లేదు. గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదులపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెనల పనులు ఎక్కడికక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. కేంద్రం ప్రకటించిన బడ్జెట్‌లో కాకినాడ-పిఠాపురం రైల్వేలైను నిర్మాణానికి కేటాయింపులపై ఇంకా స్పష్టతరాలేదు. కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్‌లోకి తీసుకువచ్చేందుకు గాను పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా 21.5 కిలోమీటర్లు ఉండే రైలు మార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకుంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాలన్న ప్రతిపాదన ఉంది. దీనికి నిధుల కేటాయింపునకు కూటమి నేతలు, కాకినాడ ఎంపీ గట్టి ప్రయత్నాలే చేస్తున్నట్టు సమాచారం.దీనిపై కూడా స్పష్టమైన ప్రకటన లేదు. అమృత్ భారత్ పథకంలో రాజమండ్రి రైల్వే స్టేషను అభివృద్ధికి రూ.270 కోట్లు కేటాయించారు. రాజమండ్రిలో గోదావరి రైల్వే స్టేషను ప్రయాణికులకు అనుకూలంగా ఉంటుంది. ఇక్కడ ఒకటి, రెండు మినహా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగవు. అన్ని రైళ్లను నిలపాలని ప్రయాణికులు చాలా ఏళ్లగా కోరుతున్నారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ గుండా రోజుకు సరాసరిన 30,336 మంది రాకపోకలు సాగిస్తున్నారు. రైలు ప్రయాణికులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు.రాజమండ్రి నుంచి విశాఖ, విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ లు నడపితే చాలామటుకు తిప్పలు తప్పుతాయి. నిడదవోలు-కాల్దరి మధ్యలో 9.75 కి.మీ మేర రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. అంచనా వ్యయం.. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనేది తెలియాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో రైల్వే బడ్జెట్‌పై ఆశలు ఉన్నా.. ఎటూ తేలకపోవడంతో మీమాంస నెలకొంది. నిధుల విడుదలలో ఏపీకి ఏ లోటూ చేయమని నిర్మలమ్మ ప్రకటించడంతో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

'పోల' వరమే

6



బడ్జెట్.. బాగు..బాగు



ఆశల పద్దు..అందరికీ అందేటట్టు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

నిర్మలమ్మ పద్దు ఈసారి కరుణించింది. పేద, మధ్య తరగతి, ఉద్యోగ వర్గాలను ఊరించి.. ఊరించి నిరాశపరచడమే పనిగా కొన్నేళ్ల పాటు సాగిన బడ్జెట్ ఈసారి నిర్మలంగా మారింది. అన్ని వర్గాలకు ఎంతోకొంత ఉపశమనం కలిగించింది. ప్రతిసారీ రకరకాల వాతలు, వాయింపులతో జేబులు గుల్ల చేసిన బడ్జెట్ ఈసారి సామాన్యులు, ఉద్యోగుల జేబుల్లోంచి కాసులను ఎంతో కొంత మిగిల్చే నిర్ణయాలతో ఊరటనిచ్చింది. ఉద్యోగులు,పెన్షనర్లను పన్ను పోటు నుంచి కొంతవరకు తప్పించింది. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం అందిస్తామని ప్రకటించడంతో కాకినాడ నోడ్ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసినట్లయింది. ఇది పరుగులు పెడితే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక, ఆటోమొబైల్, టెక్స్‌టైల్, పెట్రోకెమికల్, పోర్టుల రూపురేఖలు మారడంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులు పరుగులు తీయనున్నాయి. కాకినాడ-రాజమహేంద్రవరం నగరాల రూపురేఖలు మారడంతో పాటు పది వేల ఎకరాల్లో పారిశ్రామిక క్లస్టర్లు అభివృద్ధి చెందనున్నాయి.ఔత్సాహిక వ్యాపారులకు ముద్ర రుణాల పెంపుతో కేంద్ర బడ్జెట్ కొత్తబాటలు పరిచింది. రొయ్యలు, చేపల ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ 5 శాతం తగ్గింపుతో ఉమ్మడి జిల్లాలో సంక్షోభంలో ఉన్న ఆక్వారంగానికి కొంత తెరిపినిచ్చినట్లయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉద్యోగ, పెన్షనర్ వర్గాల్లో ఊరట నింపింది. ఉమ్మడి జిల్లాలో సచివాలయ ఉద్యోగులతో కలిపి 32వేల మంది వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. పెన్షనర్లు 45వేల మంది వరకు ఉన్నారు. వీరందరికీ తాజా బడ్జెట్‌తో కొంత మేలు జరగనుంది. కొత్తపన్ను విధానంలో కొన్ని మార్పులు చేయడం వీరికి కలిసిరానుంది. ఎప్పటిలాగే కొత్త పన్ను విధానంలో రూ.3లక్షల వరకు పన్ను లేదు. గతంలో రూ.3లక్షల నుంచి రూ.6లక్షల శ్లాబులో వార్షికాదాయం ఉన్న వారికి ఐదు శాతం పన్ను ఉండేది.కానీ ఇప్పుడు ఆ పరిమితిని రూ.7 లక్షలకు పెంచారు. వెరసి కేంద్ర బడ్జెట్ మెప్పించి అన్ని వర్గాలను మురిపించింది.

కాకినాడ నోడ్ కారిడార్‌తో వెలుగులే..

విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌కు ప్రత్యేక సాయం చేస్తామని బడ్జెట్‌లో కేంద్రం ప్రకటించడంతో కాకినాడ నోడ్ దశ తిరగనుంది. 800 కిలోమీటర్ల మేర విశాఖ నుంచి చెన్నై వరకు ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్‌లో ఆంధ్రప్రదేశ్ పరిధిలో నాలుగు నోడ్‌లు ఉండగా, అందులో కాకినాడ నోడ్ ఒకటి. మొత్తం కారిడార్ కింద ఎక్కడికక్కడ ఆయా నోడ్‌ల్లో పోర్టులు, ఎయిర్‌పోర్టులు, హైవేలు, బీచ్‌లు, పారిశ్రామిక క్లస్టర్లను అనుసంధానం చేసి పారిశ్రామిక ప్రగతి భారీస్థాయిలో ఉండేలా ఈ కారిడార్‌ను ప్రతిపాదించారు. మొత్తం విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను రూ.5,544 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం తొలిదశ కింద రూ.2,278 కోట్లతో పనులు జరుగుతున్నాయి. రెండో దశలో రూ.2,599 కోట్లతో పనులకు ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపథ్యంలో కాకినాడ నోడ్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 10వేల ఎకరాల్లో హార్డ్‌వేర్ తయారీ, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్స్, ఫార్మా, మెడికల్ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ తదితర రంగాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వివిధ క్లస్టర్ల కింద అభివృద్ధి చేస్తారు. కాకినాడలోని పోర్టులను రాజమహేంద్రవరం విమానాశ్రయానికి అనుసంధానిస్తారు. ఈ రెండు నగరాల మధ్య రోడ్డు, రైలు కనెక్టవిటీని పెంచుతారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో కార్గో సేవలను అందుబాటులోకి తెస్తారు. గోదావరి, దాని పరిధిలోని కాలువలు, పీసీపీఐఆర్ ఎక్స్‌ప్రెస్ హైవేల నుంచి పరిశ్రమలకు అనుసంధానిస్తారు. కాకినాడ నోడ్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 2045కి 2,145 మిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆశిస్తున్నారు. ప్రధానంగా కాకినాడ కారిడార్ కింద ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెట్రో కెమికల్, ఫార్మా రంగాలను భారీగా అభివృద్ధి చేస్తారు. ఉమ్మడి జిల్లాలో కాకినాడ నోడ్ కింద మామిడి జెల్లి క్లస్టర్లు 750 ఉన్నాయి. రైసుమిల్లులు, బ్రాన్ ఆయిల్ యూనిట్లు 550 ఉన్నాయి. వీటి వార్షిక టర్నోవర్ రూ.800 కోట్లు. వీటిని కూడా నోడ్ కింద క్లస్టర్ల తరహాలో అభివృద్ధి చేయనున్నారు.

ఔత్సాహికులకు ఆమోదముద్ర

వ్యాపార రంగంలో ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు గతంలో కేంద్రం ప్రవేశపెట్టిన ముద్ర రుణాలను ఈ బడ్జెట్‌లో మరింత పెంచారు. రూ.10 లక్షల పెట్టుబడి రుణాన్ని రూ.20లక్షలకు పెంచారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది యువతకు మేలు చేకూరనుంది. ఇకపై ఇంట్లో మైనర్ పిల్లల పేరు తోను తల్లిదండ్రులు పెట్టుబడులు పెట్టేలా కేంద్రం కొత్తగా బడ్జెట్‌లో ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టింది. తద్వారా లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. దేశీయ విద్యా సంస్థల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు రూ.10 లక్షల వరకు విద్యా రుణాలను కేంద్రం ప్రకటించింది. పట్టణాల్లో నివసించే ప్రజల సొంతింటి కలను నెరవేర్చేలా బడ్జెట్‌లో కేంద్రం పెద్దపీట వేసింది. ప్రధాని ఆవాస్ యోజన పథకానికి ఐదేళ్ల పాటు రూ.2.2 లక్షల కోట్ల సాయం ప్రతిపాదన చేయడంతో పాటు కోటి మంది గృహ అవసరాలు తీర్చేలా ఆర్థిక సాయం, వడ్డీ రాయితీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలకు వలస వచ్చి స్థిర నివాసం లేని వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది.

కంపెనీలకు పండగే...

పారిశ్రామిక రంగానికి ఊతమిచ్చేలా దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం అనేక కీలక నిర్ణయాలను బడ్జెట్‌లో ప్రకటించింది. అందులో భాగంగా కస్టమ్స్ డ్యూటీపై భారీ కోతలు విధించింది. దీనివల్ల ఎలక్ట్రానిక్, విలువైన లోహాలు, ఔషధాల ధరలు తగ్గనున్నాయి. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం, చుట్టుపక్కల అనేక ప్రాంతాల్లో నడుస్తున్న పలు ఫార్మా, ఇతర తయారీ యూనిట్లకు ఉత్పాదక వ్యయం తగ్గనుంది. ఆయా కంపెనీలకు ఆర్థిక భారం తగ్గనుంది. బంగారంపై బేసిక్ కస్టమ్ డ్యూటీని బడ్జెట్‌లో తగ్గించారు. పుత్తడి, వెండి వస్తువులపై కస్టమ్స్ డ్యూటీని ఆరు శాతానికి తగ్గించారు. గతంలో బంగారంపై చెల్లించే పన్ను 11 శాతం, అగ్రి సెస్‌తో కలిసి మొత్తం 15 శాతం ఉండేది. తాజా సవరణతో మొత్తం బంగారంపై పన్ను 11 శాతమే ఉండనుంది. దీని ప్రభావంతో మంగళవారం గ్రాము బంగారంపై ధర రూ.250కిపైగా పడింది. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి జీఎస్టీ వసూళ్లు కోట్లలో పెరగనున్నాయి. క్యాన్సర్ రోగులకు ఊరటనిచ్చేలా మరో మూడు కీలక ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీ పూర్తిగా తొలగించారు. దీంతో జిల్లాలో వందలాది మంది క్యాన్సర్ రోగులకు ఆర్థిక భారం తొలగనుంది. మహిళల పేరిట కొనుగోలు చేసే ఆస్తులపై సుంకాన్ని మరింత తగ్గించేలా దృష్టిపెడతామని ఆర్థిక మంత్రి ప్రకటించడంతో అతివలకు కీలక ప్రాధాన్యం ఇచ్చినట్లయింది. స్థిరాస్తులపై ఏవిధంగా దీనికి సంబంధించిన విధివిధానాలు ఉంటాయనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది.

- మోదీ సర్కారు వరాల జల్లు
- కేంద్ర బడ్జెట్‌లో స్వల్ప తాయిలాలు
- కొత్త ఆదాయపు పన్ను శ్లాబుల సవరణ
- 32 వేల మంది ఉద్యోగులకు ఊరట
- విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్
- 5,544 కోట్లతో రెండు దశల్లో అభివృద్ధి
- కాకినాడ నోడ్‌కు బంగారు భవిష్యత్తు
- 2,145 మిలియన్ డాలర్ల పెట్టుబడికి ఛాన్స్
- ఉమ్మడి జిల్లాలో పదివేల ఎకరాలు సేకరణ
- పారిశ్రామిక క్లస్టర్లకు అడుగులు
- కాకినాడ, రాజమండ్రి మధ్య అనుసంధానం
- ముద్ర రుణం రూ.20 లక్షలకు పెంపు
- ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ 5 శాతం తగ్గింపు
- ఉమ్మడి జిల్లాలో ఆక్వాకు ఊపు

ఏపీ అభివృద్ధి బడ్జెట్ ఇది..



ఏపీ అభివృద్ధి బడ్జెట్ ఇది.. ప్రాజెక్టులకు, కారిడార్‌లకు నిధులు కేటాయించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్ అన్ని వర్గాలకు అండగా ఉంది. కేంద్రం కొవిడ్ కాలంలో కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో రద్దయిన రైళ్లను వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరాను.

- దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ

రాజధానికి 15 వేల కోట్లు



అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లను అదనంగా బడ్జెట్‌లో కేటాయించడం రాష్ట్ర ప్రగతికి శుభపరిణామం. రాజధానితో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపుపై కేంద్రం భరోసా ఇవ్వడంతో అడ్డంకులు తొలగాయి. రాష్ట్రంలో మరిన్ని ప్రాజెక్టులకు, కారిడార్‌లకు నిధులు కేటాయించారు.

- గంటి హరీష్‌మాధుర్, అమలాపురం ఎంపీ

ఆశాజనకంగా ఉంది



కేంద్ర బడ్జెట్ ఆశాజనకం. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు హామీ ఇవ్వడం, వెనుకబడిన రాయల సీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయం. పూర్వోదయ పథకం ద్వారా ఏపీకి కొత్త ప్రాజెక్టులు ప్రకటించడం ద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుంది.

- తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ ఎంపీ

ఆక్వాకు ఊపే..

ఉమ్మడి తూ.గో. జిల్లాలో కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ఆక్వా రంగం భారీగా విస్తరించి ఉంది. 58వేల ఎకరాల్లో 23వేలకుపైగా హేచరీలు నడుస్తున్నాయి. అటు వేలాది ఎకరాల్లో చేపల చెరువులు ఉన్నాయి. గడచిన మూడేళ్లలో ఫీడ్ ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో పెట్టుబడి వ్యయం తీవ్రంగా పెరిగిపోయింది. ఏటా ఉమ్మడి తూ.గో.జిల్లా నుంచి కోట్లలో ఒక్క రొయ్యల ఫీడ్ కోసమే ఆక్వా రైతులు ఖర్చు చేస్తున్నారు. అదే సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో ఈ రంగం ప్రస్తుతం సంక్షోభంలో ఉంది. ఈ తరుణంలో కేంద్ర బడ్జెట్ ఆక్వా రంగానికి భారీ ఉపశమనం కలిగించింది. రొయ్యలు, చేపల ఫీడ్‌పై కస్టమ్స్ డ్యూటీ ఐదు శాతం తగ్గించింది. దీంతో రొయ్యలు, చేపల ఫీడ్ ధరలు భారీగా తగ్గనున్నాయి. ఈ నేపథ్యంలో తిరిగి ఈ రంగం కొంత కోలుకునే అవకాశం ఏర్పడింది.





అన్నంపల్లి అక్విడెక్టు వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

వరదలను ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధం

కలెక్టర్ మహేష్‌కుమార్... అన్నంపల్లిలో ఫ్లడ్ స్టోరేజ్ గోదాము పరిశీలన

ముమ్మిడివరం, జూలై 23: గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలోని ఫ్లడ్ స్టోరేజ్ గోదామును, అన్నంపల్లి అక్విడెక్టును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనసీమ జిల్లాలోని 12 మండలాల్లో 75 గ్రామాలు వరద ముంపు బారిన పడే అవకాశం ఉందన్నారు. వరద సహాయక చర్యలు అందించేందుకు అధికారులు, సిబ్బందిని నియమించామన్నారు. బాధితులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నమైనా అధికారుల దృష్టికి తీసుకువెళ్తే నిమిషాల్లో తగు చర్యలు తీసుకుంటారన్నారు. వరద ముంపు బాధితులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ముంపు ప్రభావిత గ్రామాల్లో సహాయక చర్యలకు క్షేత్ర స్థాయి, సచివాలయ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. విద్యుత్ సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత ఆర్డీవోల పర్యవేక్షణలో ట్రాన్స్‌కో ఇంజనీర్లు చర్యలు చేపడుతున్నారన్నారు. జలవనరుల శాఖ అధికారులు ఫ్లడ్ స్టోరేజ్ వద్ద అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉంచారన్నారు. వరద హెచ్చరికలకు అనుగుణంగా పరిస్థితులను బట్టి బలహీనంగా ఉన్నచోట్ల ఏటిగట్ల ఎత్తు పెంచుతూ పటిష్టపరచాలని ఇంజనీర్లను ఆదేశించానన్నారు. కొన్ని ప్రాంతాలు ముంపు బారిన పడి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. కాజ్‌వేల వద్ద, నీటి ప్రవాహం అధికంగా ఉన్నచోట్ల వాహనాల రాకపోకలు నిలుపుదల చేయాలన్నారు. అన్నంపల్లి ఫ్లడ్ స్టోరేజ్ వద్ద 42వేల ఇసుక బస్తాలు, మూడువేల సర్వే బాదులు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉందన్నారు. అనంతరం కలెక్టర్ పల్లంకుర్రు వద్ద ఏటిగట్ల పరిస్థితిని పరిశీలించారు. మూడో నంబరు ప్రమాద సూచిక జారీ అయితే వరద నీరు గట్టుపై నుంచి ప్రవహించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేయడంతో అక్కడ ఏటిగట్టు ఎత్తును పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెంట ప్రత్యేకాధికారి టీకేపీ ప్రసాద్, ముమ్మిడివరం వరద సహాయక అధికారి వి.మధుసూదన్, డ్రెయిన్స్ విభాగం డీఈ ఎంవీ కిశోర్, జలవనరుల శాఖ జేఈ ఈశ్వర్‌మన్యం, సునీతాదేవి, శివరామ్‌కుమార్ ఉన్నారు.

వైద్య, ఆరోగ్య శాఖ సీనియర్ అసిస్టెంట్
యానాం గోదావరిలో దూకి గల్లంతు

గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు... కేసు నమోదు చేసిన ఐ.పోలవరం పోలీసులు.... మెయిన్‌లో

ఉరకలెత్తి... లంకలను ముంచెత్తి

అమలాపురం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గోదావరి నదీపాయలను అనుకుని ఉన్న లంక గ్రామాల్లోకి వరద నీరు పోటెత్తింది. ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ మహేష్‌కుమార్ మంగళవారం పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఉభయ గోదావరి జిల్లాలను కలిపే చాకలిపాలెం, కనకాయలంక, తొగరపాయ, అప్పనపల్లి కాజ్‌వేలు జలదిగ్బంధానికి గురయ్యాయి. అప్పనపల్లిలోని బాలబాలజీ ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో 13.5 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ఫలితంగా కోనసీమలోని గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కాట్రేనికోన మండలం కుండలేశ్వరం ఏటిగట్టు కుంగిపోవడంతో ఆ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. తక్షణం గ్రావెల్‌తో పూడ్చే పనులు ప్రారంభించారు. జిల్లాలో 25 బోట్లను సిద్ధం చేశారు. 75 పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి వరద బాధితులకు పునరావాసం కల్పిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,220 సురక్షిత మంచి నీటి ప్యాకెట్లు, 20 లీటర్ల సామర్థ్యం కలిగిన 1025 వాటర్ టిన్నులను సరఫరా చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాయని ఆయన తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని విద్యా సంస్థలకు బుధవారం కూడా సెలవు ప్రకటించారు. వరద లేని ప్రాంతాల్లో పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయని కలెక్టర్ చెప్పారు. వరద ఉధృతి కారణంగా అన్ని రేవుల్లో పడవ, పంటు ప్రయాణాలను నిలిపివేశారు. భారీ వర్షాలు, వరదల వల్ల వేలాది ఎకరాల్లో పంట పొలాలు ముంపులో చిక్కుకున్నాయి.

పొంగి ప్రవహిస్తున్న గోదావరి నదీపాయలు



ముమ్మిడివరం మండలం గురజాపులంకలో సిమెంటు రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తున్న దృశ్యం

శిథిలావస్థలో లొల్ల లాకులు: సెంట్రల్ డెల్టాకు పొంచి ఉన్న ప్రమాదం

ఆత్రేయపురం, జూలై 23: బ్రిటిష్ హయాంలో కాటన్ మహనీయుడు నిర్మించిన లొల్ల లాకులు నేడు శిథిలస్థితికి చేరుకున్నాయి. జగన్ ప్రభుత్వంలో కనీస నిర్వహణకు నోచుకోలేదు. లాకులు కుప్పకూలితే సెంట్రల్ డెల్టాకు పెనుప్రమాదం పొంచి ఉంది. కోనసీమలోని 16 మండలాలకు సాగునీరు అందించే లొల్ల లాకులపై భారీ వాహనాల రాకపోకలతో రెయిలింగ్ విరిగిపోయి లాకులు కుంగిపోయాయి. ఇరిగేషన్ సిబ్బంది కోసం నిర్మించిన క్వార్టర్లు శిథిలస్థితికి చేరుకోగా లాకు సూపరింటెండెంట్ కార్యాలయం పనికి రాకుండా పోయింది. గన్నవరం-అమలాపురం కాలువలకు సాగునీరందించే లాకులు, రహదారి ఛిద్రమైంది. ప్రధాన గేట్ల వద్ద వ్యర్థ పదార్థాలు పేరుకుపోతున్నాయి. లాకుల తలుపులకు గ్రీజు పెట్టకపోవడంతో తుప్పపట్టిపోతున్నాయి. ఇరిగేషన్ అధికారులు గత వేసవిలో రూ.60 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. అవి మరుగునపడడంతో వేసవిలో క్లోజర్ పనులు మచ్చుకైనా చేపట్టలేదు. దీంతో డెల్టా ప్రాంతంలోని శివారు ప్రాంతాల రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు.



అధ్వానంగా లొల్ల ప్రధాన లాకులు



137 ఏళ్ల క్రితం బ్రిటిష్ పాలకులు నిర్మించిన లొల్ల లాకుల వ్యవస్థ కుప్పకూలిపోయే స్థితికి చేరుకుంది. ఇదే జరిగితే సుమారు 2 లక్షల ఎకరాల్లో సాగు చేసుకుంటున్న ఐదు నియోజకవర్గాల రైతులు తీవ్రంగా నష్టపోతారు. రైతులకు ఎంతో ప్రయోజకరమైన లాకులను ఆధునికీకరించి కోనసీమ రైతులను ఆదుకోవాలి. అంతేగాక బొబ్బర్లంక నుంచి లొల్ల లాకుల మీదుగా రావులపాలెం వెళ్లే జడ్పీ రహదారిపై వేలాది మంది నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, ర్యాలి జగన్మోహినీకేశవస్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తుంటారు. ఈ రహదారిని ఆధునికీకరించాలి.

- కొత్తపేట నియోజకవర్గంలోని సమస్యలు, అన్నదాతల ఆక్రందనపై మంగళవారం అసెంబ్లీలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

జిల్లాలో 85వేల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి

- ఆగస్టు 15 నాటికి మిగిలిన పది శాతం పూర్తయ్యేలా చర్యలు
- 360 ఎకరాల్లో నారుమడులు మునక
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసుబాబు

పి.గన్నవరం, జూలై 23: జిల్లావ్యాప్తంగా మొదటి పంటకు సంబంధించి 1,68,780 ఎకరాల్లో వరి నాట్లు పూర్తిచేసే లక్ష్యంలో భాగంగా ఇప్పటివరకు 85,500 ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బోసుబాబు తెలిపారు. మండలంలోని పోతవరంలో నీట మునిగిన వరి చేలను పరిశీలించిన అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈసారి మొదటి పంటకు సంబంధించి రాయవరం, మండపేట, రామచంద్రపురం, కపిలేశ్వరపురం తదితర మండలాల్లో నాట్లు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని, వర్షాల కారణంగా పది శాతం మిగిలాయని తెలిపారు. రైతులు ముఖ్యంగా 1029, 1128 రకాలను ఎంచుకున్నారన్నారు. జిల్లాలో ఆగస్టు 15 నాటికి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వివిధ మండలాల్లో 360 ఎకరాల్లో నారుమడులు నీట మునిగాయన్నారు. నాట్లు పూర్తయిన 6,200 ఎకరాల్లో వరి చేలు వర్షాలకు నీట మునిగాయని వివరించారు. ఇప్పటికే సంబంధిత అధికారులు చేలకు అనుసంధానంగా ఉండే డ్రెయిన్లలో పూడికతీత చేపట్టారన్నారు. వ్యవసాయ శాఖ మండల స్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. పోతవరంలో ముంపులో ఉన్న వరి చేలను పరిశీలించి ఆయకట్టు రైతులతో మాట్లాడి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. బోసుబాబు వెంట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎస్‌జేవీ రామమోహనరావు, మండల అధికారి కళ్యాణ్, ఉద్యానవన శాఖ అధికారి దిలీప్‌కుమార్, సిబ్బంది, రైతులు ఉన్నారు.



పోతవరంలో రైతులతో మాట్లాడుతున్న బోసుబాబు

ఊళ్లు..నీళ్లు



వరదనీటిలో వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి గ్రామం

పెరవలి మండలం తీపర్రులో

40 గ్రామాలు జలదిగ్బంధంలో..

వరరామచంద్రాపురం, జూలై 23: గోదావరి వరద ప్రవాహం మంగళవారం మధ్యాహ్నం నుంచి నిలకడగా ఉంది. మండల పరిధిలోని వడ్డిగూడెం కాలనీ పూర్తిగా నీటమునిగింది. మండలంలో దాదాపుగా 40 గ్రామాలు మూడు రోజులుగా జల దిగ్బంధంలో ఉన్నాయి. ఆయా గ్రామాలకు తహశీల్దార్ మౌలానాఫాజిల్ ఇంజన్ బోట్లను ఏర్పాటు చేశారు. వీఆర్‌పురం గోదావరి స్పెషల్ అధికారి ప్రసాద్‌కుమార్, సీఐ రామారావు, తహశీల్దార్, ఎస్ఐ నాగరాజు శ్రీరామగిరి, వడ్డిగూడెం, దర్భతాళ్లగూడెం గ్రామాల్లో పర్యటించారు. బాధితులకు బియ్యం, కందిపప్పు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఆర్ఐ రామకృష్ణ, సర్పంచులు పాల్గొన్నారు

ఉధృతంగా గోదావరి

ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

14.60 అడుగులకు చేరుకున్న నీటి మట్టం

14.36 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి..



ధవళేశ్వరం, జూలై 23: ఎగువ ప్రాంతాల నుంచి పోటెత్తుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం అంతకంతకు పెరుగుతుండడంతో సోమవారం రాత్రి 2గంటలకు రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆదివారం ఉదయం 7గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా 42గంటల వ్యవధిలో నీటి మట్టం 13.75అడుగులకు చేరుకుని 13లక్షల క్యూసెక్కులు నీరు తరలిరావడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై నీటి మట్టం పెరుగుదల క్రమంగా నెమ్మదించి 3గంటలకు ఒక పాయింట్ చొప్పున పెరుగుతూ మంగళవారం రాత్రి 11 గంటలకు 14.80అడుగులకు చేరుకుంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 14,36,472 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. ఎగువన అన్ని ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టడంతో శుక్రవారం నాటికి ప్రమాదహెచ్చరికలు ఉపసంహరించే స్థాయికి నీటి మట్టం తగ్గవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువన భద్రాచలం వద్ద మంగళవారం ఉదయం 9గంటలకు 51.60 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం ఆపై తగ్గుతూ రాత్రి 7గంటలు 50.50 అడుగులకు చేరింది.

ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టం తగ్గుముఖం

ఎగువన అన్ని ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గుముఖం పట్టింది. కాళేశ్వరం వద్ద 12.39 మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం క్రమంగా తగ్గుతూ మంగళవారం సాయంత్రానికి 11.480మీటర్లకు చేరుకుంది. పేరూరు వద్ద 17.300 మీటర్ల నుంచి 16.290 మీటర్లకు, దుమ్ముగూడెం వద్ద 14.070 మీటర్ల నుంచి 13.710మీటర్లకు, భద్రాచలం వద్ద 51.60అడుగుల నుంచి 50.50అడుగులకు నీటి మట్టం తగ్గింది. కూనవరం వద్ద 21.450మీటర్లగా నీటి మట్టం నమోదు కాగా స్వల్పంగా పెరుగుతోంది. కుంట వద్ద 12.700మీటర్ల వరకు పెరిగిన నీటి మట్టం తగ్గుతూ 12.660మీటర్లకు చేరుకుంది. పోలవరం వద్ద 13.450 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.920మీటర్లుగా నమోదు కాగా నీటి మట్టం పెరుగుతూ ఉంది.

బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్

పెరుగుతున్న శబరి

చింతూరు వద్ద శబరి నీటిమట్టం 41.6 అడుగులు

శబరికి గోదావరి ఎగపోటు

జలమయమైన జాతీయ రహదారులు

చింతూరు, జూలై 23: చింతూరు వద్ద మంగళవారం సాయంత్రానికి శబరి నీటి మట్టం 41.6 అడుగులకు చేరింది. భద్రాచలంలో 51.6 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టి 50.9 అడుగులకు చేరుకుంది. కూనవరం వద్ద గోదావరి వరద శబరి వరదకు పోటునివ్వడంతో ఆ నీరంతా తిరిగి వెనక్కి రావడంతో చింతూరు వద్ద ఉధృతి పెరుగుతోంది. దీంతో పలు రహదారులపై వరద నీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో డివిజన్‌లోని 177 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్ అయ్యాయి. పలు గ్రామాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో



నీళ్లల్లో వడ్డిగూడెం గ్రామం

ఆయా కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళుతున్నాయి. చింతూరు మండలం చట్టి వద్ద 30వ నెంబరు జాతీయ రహదారి, కుయుగూరు వద్ద 326వ నెంబరు జాతీయ రహదారులు జలమయమయ్యాయి. దీంతో ఆ దిశగా రాకపోకలు నిలిచి రహదారులపై వాహనాలు బారులు తీరాయి. వరద ప్రభావిత గ్రామాలకు రేషన్, నిత్యావసర సరుకుల పంపిణీ మొదలైంది. ఈ మేరకు రెడ్ క్రాస్ సొసైటీ సేవలందిస్తోంది. కాగా బాధితులు స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న వలస పాకల్లో విద్యుత్ సౌకర్యం కల్పించే అవకాశం లేకపోవడంతో వారంతా చీకట్లో మగ్గాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల సమీపంలో వరద నీరు చేరడంతో గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేశారు. గ్రామాలను వరద నీరు చుట్టుముట్టడంతో పలువురు నిత్యావసర సరుకుల కోసం నాటు పడవలపై చింతూరు చేరుకుంటున్నారు. వరరామచంద్రపురం మండలంలో నోడల్ అధికారి ప్రశాంత్‌కుమార్ ముంపు ప్రాంతాలలో నేరుగా పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. డొంకరాయి రిజర్వాయరు సామర్థ్యం 1037 అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి 1032.90 అడుగులకు చేరుకుంది. చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా విలీన మండలాల ప్రజలు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందిగా ప్రకటించారు. రహదారులపై భారీ స్థాయిలో వరద నీరు చేరడంతో ఆ దిశగా ప్రయాణం చేసే సాహసం ఏ ఒక్కరూ చేయవద్దని ఆయన సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఎటపాక మండలంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

వరద కాస్త తగ్గుముఖం



నందిగామపాడు హైస్కూల్‌ను చుట్టుముట్టిన వరద

ఎటపాక, జూలై 23: గత రెండు రోజులుగా పెరుగుతూ వస్తున్న గోదావరి వరద ...మంగళవారం మధ్యాహ్నం నుంచి కాస్త నెమ్మదిగా తగ్గుతుంది. మంగళవారం ఉదయం 51.6 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం మధ్యాహ్నం తర్వాత నిలకడగా ఉంటూ, క్రమంగా తగ్గుతోంది. దీంతో విలీన మండలాల వాసులు కాస్త ఊపిరిపీల్చుకున్నారు. అయితే గత రెండు రోజులుగా భద్రాచలం-కూనవరం ప్రధాన రహదారి జలదిగ్బంధంలోనే ఉంది. ఈ వైపు రాకపోకలు స్తంభించాయి. వీరాయిగూడెం- నెల్లిపాక గ్రామాల మధ్యలో రహదారిపై వరదనీరు చేరడంతో గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచాయి. నందిగామ జడ్పీ పాఠశాల ఆవరణను వరదనీరు చుట్టుముట్టింది.

బాధితుల్లో అదే భయం



బోట్ల ద్వారా పునరావాసానికి తరలివెళ్తున్న దృశ్యం

కూనవరం, జూలై 23: కూనవరం మండలం పరిధిలో గోదావరి ఉధృతి కొనసాగుతోంది. వరద బాధితులు పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. పూర్తిగా 52 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించిపోయింది. నిత్యావసర సరుకుల కొనుగోళ్లు ఆగిపోయాయి. కూరగాయలతో పాటు పాలు కూడా దిగుమతి కాలేదు. కూనవరం, టేకులబోరు, మరికొన్ని గిరిజన గ్రామాల ప్రజలు కోతులగుట్ట పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. శబరి బెల్టులోని గిరిజన గ్రామాలు గుట్టలెక్కి అక్కడే ఉన్నారు. మరో వైపు యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం పనులు చేపట్టింది. పునరావాస కేంద్రాలకు ప్రజలు వెళ్లేందుకు బోట్లను ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రెండు నెలలకు సరిపడ బియ్యం పంపిణీ జరిగింది. రాత్రి వేళల్లో నిర్వాసితులను ట్రాక్టర్ల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు. నేటి నుంచి ప్రభుత్వం నిత్యావసర సరుకులను పంపిణీ చేయనుంది. ప్రతీ గ్రామానికి ట్రాక్టర్లు, వ్యాన్లు ద్వారా బియ్యం, టార్పాలిన్లు, సరుకులు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

ఇక పోలవరమే



ఏజెన్సీలో నిర్వాసిత గ్రామం ఏర్పాటుకు సేకరించిన స్థలం

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్మాణానికి తమ పూర్తి సహకారం ఉంటుందని కేంద్రం ప్రకటించింది. దీంతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసినట్టయింది. 2019కి ముందు అప్పటి సీఎం చంద్రబాబు 72 శాతం మేర ప్రాజెక్టు పనులు పూర్తిచేసిన సంగతి తెలిసిందే. కానీ మొత్తం భూసేకరణ, పునరావాసం, కాలువలు అన్నీ కలుపుకుంటే కేవలం 49.79 శాతం అయినట్టే లెక్క. ఇక 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసింది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంరావడం, చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ దశ తిరిగింది. గతంలో మారిన అంచనాలను కూడా కేంద్రం అంగీకరించి, ప్రాజెక్టును పూర్తిచేయడానికి సహకరిస్తుందని కూటమి నేతలు చెబుతున్నారు. ప్రాజెక్టును 41.15 మీటర్ల ఎత్తువరకూ మొదటి దశలో నిర్మించడానికి గతంలో కేంద్ర కేబినెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. దాని ప్రకారం 30,436.95 కోట్ల అంచనా వేశారు. అందులో హెడ్‌వర్క్సు పనులకు రూ.14,023.2 కోట్లు, ఎడమ ప్రధాన కాలువ నిర్మాణానికి 1955.23 కోట్లు, కుడి ప్రధాన కాలువ నిర్మాణానికి 1812.45 కోట్లు, భూసేకరణకు 4853.22 కోట్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి రూ.7417.19 కోట్లు, పీపీఏ చార్జిల కింద రూ.375.66 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఇది జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించకముందే రూ.4730.71 కోట్లు ఖర్చయింది. గత ఏప్రిల్ నాటికి 25,706.24 కోట్లు బ్యాలెన్స్ ఉంది. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత 15,146.27 కోట్లు విడుదల చేశారు. ఫేజ్-2 కోసం ఖర్చు చేసింది రూ. 1597.56 కోట్లు. ఇంకా మిగిలింది రూ.12,157.53 కోట్లు. మరోవైపు 2019కి ముందే ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయ అంచనాను రూ.54 వేల కోట్లకు పెంచి ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. అప్పట్లో కేంద్రం కూడా అంగీకరించింది. కానీ వైసీపీ వైఖరి వల్ల దీనిపై కేంద్రం స్పష్టత ఇవ్వలేదు. ఇవాళ మళ్లీ దీనిపై కదలిక వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం డయాఫ్రంవాల్ దెబ్బతినడం వల్ల దానికి రిపేర్లు చేయాలంటేనే రూ.447.90 కోట్లు అవసరం. ప్రత్యామ్నాయ డయాఫ్రంవాల్ నిర్మించాలంటే రూ.990 కోట్లు అవుతుంది. ప్రత్యామ్నాయ డయాఫ్రంవాల్ వైపే రాష్ట్రం మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.

భూసేకరణ, పునరావాసానికే రూ.26 వేల కోట్లు కావాలి

రంపచోడవరం, జూలై 23: విభజన చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం పోలవరం బాధ్యత మొత్తం కేంద్రంపైనే ఉంది. అయితే ఇంతకాలం దోబూచులాడుతూ వచ్చిన కేంద్రం, ఎట్టకేలకు ఆంధ్రుల జీవనాడిగా పేరొందిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం తమ బాధ్యతగానే చెప్పుకొచ్చింది. ఈ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి ఒక్క భూసేకరణ-పునరావాసం కోసమే రూ.33,470 కోట్లు అవసరమని అంచనా వేయగా, ఇప్పటికీ భూసేకరణ-పునరావాసాల కోసం ఇంకా రూ.25,917 కోట్లు అవసరం. పోలవరాన్ని పూర్తి స్థాయిలో పూర్తిచేయాలంటే భూసేకరణలో ఇంకా 54,640 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇంకా 83,863 మంది నిర్వాసితులను తరలించాల్సి ఉంది. ఇందులో భూసేకరణ కోసం రూ.6,577 కోట్లు, పునరావాసం కోసం రూ.19,340 కోట్లు అవసరమవుతున్నాయి. ఈ ప్రక్రియ పూర్తి కాకుండా నిర్వాసితులను వారి గ్రామాల నుంచి తరలించడం సాధ్యం కాదు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్వాసితుల పునరావాసాన్ని పూర్తి చేయకుండా దేవీపట్నం మండలంలోని ముంపు గ్రామాలన్నిటినీ తరలించడం నేడు వివాదంగా మారింది. కాగా కనీసం తొలిదశలో +41.15 మీటర్ల కాంటూరు స్థాయిలో పూర్తి చేయడానికి 172 ఆవాసాల్లో 38 వేల నిర్వాసిత కుటుంబాలలో 25,263 కుటుంబాల పునరావాసాన్ని, 1 లక్ష ఎకరాలకుగానూ ఇంకా 16,440 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. 121 కాలనీలలో ఇంక 95 కాలనీలను నిర్మించాల్సి ఉంది. వీటిలో పునరావాసానికి రూ.4,787 కోట్లు, భూసేకరణ కోసం రూ.2,328 కోట్లు కావాలి. వీటిని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా తొలిదశ ప్రాజెక్టు సంపూర్ణానికి రూ.12,157 కోట్లు అవసరమవుతాయని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖను ఇప్పటికే కోరింది. తాజా బడ్జెట్‌లో పోలవరం కోసం నిధుల కేటాయింపు లేనప్పటికీ విభజన చట్ట హామీలను నెరవేర్చడానికి సిద్ధమైన కేంద్రం దశలవారీగా పోలవరానికి నిధులను విడుదల చేస్తుందన్న ఆశాభావం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కేంద్ర బడ్జెట్‌పై హర్షం

కేంద్ర బడ్జెట్‌పై అన్ని వర్గాలకు చెందిన వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఏపీకి వరాల జల్లు కురిపించడంపై ఆనందపడుతున్నారు. అమరావతికి రూ.15 వేల కోట్ల కేటాయింపుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పలువురి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

మండపేట, రాజమహేంద్రవరం సిటీ, కాకినాడ సిటీ, దివాన్‌చెరువు

అమరావతికి నిధుల కేటాయింపు హర్షణీయం

- వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే



రాజధాని అమరావతికి రూ.15000 కోట్లను కేటాయించడం హర్షణీయం.. ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజ్ఞతలు.. పదేళ్ల తర్వాత ఏపీకి మంచిరోజులు వచ్చాయి. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు అభినందనలు. రాష్ట్రానికి నిధులు రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి..

ఇక ఏపీ అభివృద్ధి దిశగా పరుగులు

- వేగుళ్ల లీలాకృష్ణ, జనసేన ఇన్‌చార్జి, మండపేట



పదేళ్ల పాటు వెనుకబడిన ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అభివృద్ధిలో పరుగులు పెట్టడం ఖాయం. రాజధాని కోసం రూ.15 వేల కోట్లను కేటాయించటం ద్వారా ఇది నిరూపితమైంది. కేంద్రం నుంచి నిధులు వచ్చేలా కృషి చేసిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు అభినందనలు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు కృతజతలు..

ఐదేళ్ల తర్వాత బడ్జెట్‌లో ఏపీకి గుర్తింపు

ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే



ఐదేళ్ల తర్వాత కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి మంచి గుర్తింపు ఇచ్చింది. ఇది మన రాష్ట్రానికి ఆక్సిజన్ వంటిది. అయితే దీనితోనే అంతా అయిపోదు, కేంద్ర సాయానికి మన కష్టం కూడా తోడవ్వాలి. అందరం కలిసి కష్టపడి మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం. బడ్జెట్‌లో కేటాయింపులు చేసిన కేంద్రానికి, ప్రధాని మోదీకి ధన్యవాదాలు. ఈ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందరం నడుంబిగిద్దాం..

అమరావతికి నిధుల కేటాయింపు సంతోషదాయకం

గన్ని కృష్ణ, టీడీపీ నేత



కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు అనుగుణంగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం ఆర్థికంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకునేలా బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన నిధుల కేటాయింపు, హామీలు ఆనందాన్ని కలిగించాయి.అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇస్తామని వెల్లడించడం సంతోషించే విషయం.

రైతుల త్యాగాలను గుర్తించిన కేంద్రం

- మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు



కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో అమరావతి రైతులను త్యాగాలను గుర్తించి ఈ బడ్జెట్‌లో రూ. 15 వేల కోట్లు కేటాయింపులు చేయడం చాలా ఆనందంగా ఉంది. అదే విధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించడంతో ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

పన్ను స్లాబ్ రేట్లు సవరించడం వల్ల ఆదా

ఏపీఎన్జీవోస్ నేత గుద్దటి రామ్మోహనరావు



కొత్త పన్ను స్లాబ్ రేట్లు సవరించడం వల్ల ఉద్యోగులకు రూ.17,500 వరకు ఆదా అవుతుంది. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15వేలకోట్ల ఆర్థిక సాయం, పోలవరం ప్రాజెక్టుకు అధిక నిధులు కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, వైజాగ్ నుంచి చెన్నై వరకు ఇండస్ట్రియల్ కారిడార్‌కు నిధులు కేటాయింపు జరగడం శుభ పరిణామం

రాష్ట్రానికి అధిక నిధులు శుభపరిణామం

తాటిపాక మధు, సీపీఐ నేత



కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అధిక నిధులు రావడం శుభపరిణామం. అన్నిప్రాంతాలు, అన్నిరంగాల అభివృద్ధికి కేంద్రం నుంచి కూటమి ప్రభుత్వం భారీగా నిధులు రాబట్టింది. నిధులు రాబట్టడంలో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ఫలించింది. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రూ.15వేల కోట్ల ఆర్థికసాయం, పోలవరం ప్రాజెక్టు పూర్తికి అధిక నిధులు, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ హర్షణీయం..కాకినాడ రైల్వే మెయిన్‌లైన్‌కు నిధులు రాబట్టాలి.

కోశ లోటు బడ్జెట్ ఇదే..

డాక్టర్ పి.లక్ష్మీనారాయణ, ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్



కొవిడ్ తర్వాత అత్యంత తక్కువ కోశలోటు ఉన్న బడ్జెట్ ఇదే. కేంద్ర తాజా బడ్జెట్‌లో కోశలోటు 4.9 శాతం ఉంది. దీనివల్ల వస్తువుల ధరలు ఆ మేరకు పెరగవచ్చు. అయితే ఎఫ్ఆర్‌బీఎం చట్టంలో కోశలోటు 3 శాతం మించకూడదన్న నిబంధన ఉంది. భవిష్యత్‌లోనైనా ఈ నిబంధనలను పాటిస్తే బాగుంటుంది.

విద్యుత్ ప్రమాదాలను ఇలా అరికడదాం

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి



రాజమహేంద్రవరం సిటీ, జూలై 23: విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రమాదాలు నివారిద్దామని విద్యుత్ వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి సూచించారు. ఈమేరకు మంగళవారం రాత్రి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నప్పుడు ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాను సమయంలో ఇంటి గృహోపకరణాల స్విచ్‌లను ఆఫ్ మోడ్లో ఉంచాలని, ఇంటి లోపల కరెంటు స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడి చేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్నపిల్లలను కరెంట్ వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదన్నారు. వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లను ముట్టుకోరాదని, ఇంటి పరిసరాల్లో చెట్లు, కరెంట్ పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా, కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి ఆవరణలో ఉన్న నీళ్ల మోటారు, నీటి పంపులను, వాటికి ఉన్న కరెంటు వైర్లను, జాయింట్స్‌ను తాకకూడదన్నారు. ఏ ప్రదేశంలోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి ఉంటే దానిని విద్యుత్ ప్రసారం ఉన్నదిగా పరిగణించి వాటిని నేరుగా తాకకుండా వెంటనే విద్యుత్ శాఖకు లేదా టోల్‌ఫ్రీ నెంబరు 1912కి తెలియజేయాలన్నారు. పంటపొలాల వద్ద మోటార్లు వర్షం నీటిలో మునిగి ఉండటం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉన్నందున రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

భద్రాచలం వైపు ప్రయాణాలకు అడ్డుకట్ట

రహదారిని మూసివేసిన తెలంగాణ ప్రభుత్వం



ఇసుక మూటలతో రహదారిని మూసివేసిన దృశ్యం

ఎటపాక, జూలై 23: విలీన మండలాల వాసులు తెలంగాణకు వెళ్లే ప్రధాన రహదారిలో భద్రాచలం వద్ద ఆ రాష్ట్ర అధికారులు ఇసుక మూటలతో అడ్డుకట్ట వేశారు. దీంతో విలీన వాసులు భద్రాచలం వెళ్లేందుకు గత రెండు రోజుల నుంచి అవస్థలు పడుతున్నారు. భద్రాచలం పట్టణానికి వరద ముంపు లేకుండా ఉండేందుకు గత నాలుగైదు నెలలుగా భద్రాచలం శివారు ప్రాంతంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం కరకట్ట నిర్మాణ పనులు చేపడుతోంది. దాదాపుగా ఆ పనులు పూర్తి దశకు చేరాయి. అయితే గోదావరి వరద పెరగడంతో వరదనీరు ఈ ప్రధాన రహదారి నుంచి కరకట్ట నిర్మాణం చేపట్టే వైపు చేరి ముంపునకు గురయ్యే ప్రమాద ముందని గుర్తించిన అక్కడి అధికారులు భద్రత రీత్యా విజయవాడ- జగదల్‌పూర్ జాతీయ రహదారిని ఇసుక మూటలతో మూసివేయించారు. దీంతో గత రెండు రోజులుగా ఈ రహదారి వైపు వెళ్లాల్సిన వాహనాలు ఏపీలోని పురుషోత్తపట్నం నుంచి తెలంగాణలోని భద్రాచలానికి ఇరుకు రహదారిలో వెళుతున్నాయి.

వీరేంద్రకుమార్‌ను స్వదేశానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి

అంబాజీపేట, జూలై 23: ఏజెంట్ చేసిన మోసంతో సౌదీ అరేబియాలో ఒంటెల కాపరిగా పనిచేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇసుకపూడికి చెందిన సరెళ్ళ వీరేంద్రకుమార్‌ను అక్కడ నుండి ఇండియాకు తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి హైదరాబాద్‌ను సంప్రదించి, సౌదీలలోని ఇండియన్ ఎంబీసీ అధికారులతో మాట్లాడారు. సౌదీ అరేబియా దామామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వీరేంద్రకుమార్‌ను తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ చెప్పారు. బుధవారం మధ్యాహ్నానికి వీరేంద్రకుమార్ స్వదేశానికి తిరిగి వస్తారని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

గంజాయితో నలుగురి అరెస్టు

మలికిపురం, జూలై 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం సత్యజ్యోతి థియేటర్ వద్ద గంజాయి అమ్ముతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్లు మలికిపురం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు మార్గాల్లో ప్రవేశించకుండా చదువుపైనా, కెరీర్‌పైన దృష్టి సారించాలన్నారు. మలికిపురం పరిధిలో గంజాయి విక్రయాలపై పూర్తి నిఘా ఉంచామన్నారు.

సమర్థవంతంగా శిక్షణ పూర్తి చేయాలి

అమలాపురంటౌన్, జూలై23: టీచ్‌టూల్ శిక్షణను సమర్థవంతంగా పూర్తి చేయాలని డీఈవో ఎం.కమలకుమారి విజ్ఞప్తి చేశారు. అమలాపురం బాలుర, పేరూరు ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆమె పరిశీలించారు. డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశరావు, సమగ్ర శిక్షా సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, నోడల్ అధికారి పి.రాంబాబు, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, కె.వెంకటేశ్వరరావు, ఎస్.దుర్గాదేవి, ఎల్ఎఫ్ఈ స్టేట్ కోఆర్డినేటర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

- లంక గ్రామాల్లో పడవలపై ప్రయాణం
- వాణిజ్య పంటలను ముంచెత్తిన వరదనీరు
- కూటమి నాయకులు, అధికారుల పర్యటన

లంక గ్రామాలను ముంచిన వరద






అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెం వద్ద వరద ముంపులో మత్స్యకారుల పాట్లు, అయినవిల్లి: అయినవిల్లిలంకలో నీట మునిగిన పంట పొలాలు, ఆలమూరు: పెనికేరులో ముంపునకు గురైన నాట్లు, పి.గన్నవరం: ఉడిమూడి ఏటిగట్టు దిగువున వరదనీటిలో మునిగిపోయిన సంచారజాతుల గుడెసెలు

పి.గన్నవరం, జూలై23: గోదావరి ఎగువన కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాలుగు రోజులుగా గోదావరికి వరద పోటు మొదలైంది. ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి మిగులు జలాలను విడుదల చేయడంతో దిగువన నదీ పాయలు పొంగుపొర్లుతున్నాయి. ఇప్పటికే లంకలను పూర్తిగా చుట్టేసిన వరద ఇక గ్రామాల్లోకి ప్రవేశిస్తుంది. ఉరకలేస్తున్న గోదావరిని చూసి లంకగ్రామాల్లో రైతులు పరుగులు పెడుతున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను ఒడ్డుకు చేర్చుకుని రక్షించుకునే పనిలో పడ్డారు. గంటిపెదపూడి, ఉడిమూడి శివారు నాలుగు లంకగ్రామాల ప్రజలు ఇప్పటికే పడవలపై ప్రయాణం చేస్తున్నారు. ఏటిగట్టు దిగువన కాజ్‌వేపైకి వరద నీరు రావడంతో ఇవతలి ఒడ్డుకు రావడానికి లంకగ్రామస్తులు నానావస్థలు పడుతున్నారు. ఉడిమూడి ఏటిగట్టు దిగువన సంచార జాతులు వారి గుడిసెలు నీట మునగడంతో ఏటిగట్టుపై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. కె.ఏనుగుపల్లి కాజ్‌వే నీట మునగడంతో పడవ తిరిగే పరిస్థితి లేక వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు. ఏటిగట్టు దిగువన పురి గుడిసెలు చుట్టూ వరద నీరు చేరింది. నాగుల్లంక ఏటిగట్టు దిగువన కొంతమేర వరదనీరు ప్రవేశించడంతో అవతలి వైపు ఉన్న రాయిలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయిలంక గ్రామం రోడ్లపై వరదనీరు ప్రవేశించడంతో అధికారులుఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. వాడ్రేవుపల్లి శివారు చినకందాలపాలెం గ్రామంలోని వరద నీరు ఇళ్ల చుట్టూ ప్రవేశిస్తుంది.లంకగ్రామాల్లో వరద ఉధృతిని ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పరిశీలిం చారు. వై.కొత్తపల్లిలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా వరద నీరు వెనక్కి రావడంతో ఆర్డీవో ఇసుక బస్తాలు ఏర్పాటు చేయించి వరద నీటిని కట్టడి చేశారు. కె.ముంజవరంలో మేజర్ డ్రైన్లలో నీరు గోదావరిలో చేరేచోట లాకులను ఆర్డీవో పరిశీలించారు.

ఆత్రేయపురం: గోదావరికి వరద పెరగడంతో లంక గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక ఎగువన సాగు చేసుకుంటున్న తొమ్మిది కుటుంబాలకు చెందిన రైతులు పర్యాటక కేంద్రంలో గుడారాలు ఏర్పాటు చేసుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. సాగు చేస్తున్న వివిధ పంటలు గోదావరిలో కలిసిపోయాయి. పిచ్చుకలంక దిగువన ఇళ్లు, పశువుల షెడ్ల వద్దకు నీరు చేరుకోవడంతో మెరక ప్రాంతంలో గుడారాలు వేసుకుని జీవనం సాగించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వాడపల్లిలంకలో రైతుల కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో తహసీల్దారు వెంకట్రామయ్య, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ శ్రీనివాస్ పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

అంబాజీపేట: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో ముంపు బారిన పడిన వరి పంట పొలాలను జిల్లా వ్యవసాధికారి వి.బోసుబాబు మంగళవారం పరిశీలించారు. అయినవిల్లి-పసుపల్లి సరిహద్దున ఉన్న వక్కలంక పంట భూముల్లో ముంపునీరు దిగకపోవడంతో ఆ ముంపునీరు మళ్లించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక రైతులు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. ఈప్రాంతంలో 50ఎకరాలు ముంపునీటిలో ఉన్నాయన్నారు. అయినవిల్లిలోని జోగివారిపేట వద్ద చెరువులు తవ్వడంతో ఆ ప్రాంతంలో పంట బోదెలు కప్పివేయడంతో ముంపునీరు బయటకు వెళ్లడం లేదన్నారు. ప్రతి ఏటా ఈఇబ్బంది తప్పడంలేదన్నారు. ఎంపీడీవో జీవీ సరోవర్, తహసీల్దారు విమలకుమారి స్పందించి తక్షణమే పంట బోదెలను శుభ్రంచేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి హమీ ఏపీవో బి.చంద్రమోహన్‌ను ఆదేశించారు. ముంపునీరు బయటకు మళ్లించాలన్నారు. ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు, ఏవో సీహెచ్‌డీ విజయకుమార్, ఇరిగేషన్ ఏఈ జయలక్ష్మి, ఏఈవో డి.దుర్గారావు ఉన్నారు.

ముమ్మిడివరం: వరద ఉధృతి కారణంగా ముంపు బారిన పడిన మండలంలోని లంకగ్రామాలు లంకాఫ్‌ఠాణేలంక, గురజాపులంక, పూనలంక ప్రాంతాల్లో మంగళవారం కూటమి నాయకులు పర్యటించారు. లంక భూముల్లో సాగుచేసిన బెండ, బీర, మునగ, వంగ, మిరప, మొక్కజొన్న పంటలు నీటమునిగాయి. వాటిని కూటమి నాయకులు పరిశీలించారు. నష్టపోయిన పంటలకు, నీట మునిగిన ఇళ్లకు నష్టపరిహారం అందేలా చర్యలు ప్రభుత్వ పరంగా తీసుకుంటామన్నారు. టీడీపీ నాయకుడు దాట్ల పృథ్వీరాజు ఆధ్వర్యంలో జరిగిన పర్యటనలో తహసీల్దార్ బి.శ్రీనునాయక్, ఎంపీడీవో కేవీ నర సింహారావు, టీడీపీ నాయకులుగొలగోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, కాకర్లపూడి రాజేష్, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, తాడి జానికిరామ్, పొత్తూరి విజయభాస్కరవర్మ, గుద్దటి జమ్మి, గోదాసి పుండ రీసు, దూడల స్వామి, రంకిరెడ్డి రాంబాబు, కొప్పిశెట్టి కృష్ణ మూర్తి, నిమ్మకాయల రాజా, గోదాసి గణేష్, మెండి కమల, బద్రి రమాదేవి, కురసాల శివ, కాశి లాజర్ పాల్గొన్నారు. మండలంలోని లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశిస్తుంది. మంగళవారం ఉదయం గురజాపు లంక గ్రామానికి వెళ్లే సిమెంటు రోడ్డు కొంతమేర నీటము నిగింది. గురజాపులంక, లంకాఫ్‌ఠాణేలంక, పూనలంక, లంకాఫ్‌గేదెల్లంక, చింతపల్లిలంక తదితర గ్రామాల్లో లోతట్టు లంక భూ ముల్లోకి వరదనీరు ప్రవేశించింది. లంక గ్రామాల్లో సాగుచేసిన వంగ, బెండ,బీర, మిర్చి, అనబ తదితర పంటలు నీటమునిగాయి. లంక గ్రామాల్లోని పశువులను, వృద్ధులను, గర్భిణులను సురక్షిత గ్రామాలకు తరలించారు. పశువులకు వ్యాక్సిన్లు వేశారు. ముంపు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ప్రత్యేక అధికారి ఎస్.మధుసూదన్, తహ సీల్దార్ బి.శ్రీనునాయక్, ఎంపీడీవో కేవీ నరసింహారవు, టీడీపీ నాయకులు ముంపు ప్రాంతాల్లో పర్యటించారు.

అయినవిల్లి: ఎగువన కురిసిన వర్షాలతో గోదావరికి వరద ఉధృతి పోటెత్తింది. లంక గ్రామాలను వరద చుట్టుముట్టింది. లంకల్లో సాగుచేసే కూరగాయ పంటలు, వాణిజ్య పంటలు ముంపునకు గురయ్యాయి. అయినవిల్లిలంక కాజ్‌వేపై వరదనీరు పోటెత్తింది. వరద ఉధృతి పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎదురుబిడియం కాజ్‌వేపైకి వరదనీరు రావడంతో పడవలు ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మంచినీటిని సరఫరా చేశారు. పొట్టిలంక, చింతనలంక, కొండుకుదురులంక, తొత్తరమూడి పెద లంకలను వరదనీరు చుట్టుముట్టింది. ముంపు ప్రాంతాలను కూటమి నాయకులు పరిశీలించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోదరుడు ఆనందరావు ఆధ్వర్యంలో ఎదురుబిడియం కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. సలాది బుచ్చిరాజు, మేడిద దుర్గాప్రసాద్, కాకర శ్రీనివాస్, కడలి వెంకటసత్యనారాయణ, కముజు రాంప్రసాద్, మద్దాల సుబ్బారావు, అడపా నాగభూషణం పాల్గొన్నారు.

కె.గంగవరం: ధవళేశ్వరంవద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ, దిగువకు వదులుతున్న వరద నీటితో కోటిపల్లి వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానిక మత్స్యకార కాలనీలోకి వరదనీరు చేరుకుంది. పుష్కరాల రేవులో పైమెట్ల వరకు వరదనీరు చేరుకుంది. ఫెర్రీ రేవు పూర్తిగా వరద నీటిలో చిక్కుకుంది. దుకాణ సముదాయాల్లోకి వరద నీరు చేరుకుంది. తహసీల్దార్ రవీంద్రనాథ్, ఇరిగేషన్ ఎస్‌ఈ జి.శ్రీనివాసరావు, డీఈ కె.సుబ్బారావు వరద ఉధృతిని, సుందరపల్లి, కూళ్ల వద్ద బలహీన ఏటిగట్లను పరిశీలించారు.

వరదకారణంగా ఎవరూ అధైర్య పడవద్దని టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. మంగళవారం కోటిపల్లి మత్స్యకార కాలనీలో ఆయన పర్యటించారు. వరదలో నీటిలో చిక్కుకున్న ఇళ్ల వారిని పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు. అనంతరం పుష్కరాల రేవు, సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, పప్పుల సాయిబాబు, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ, కూటమి నాయకులు ఉన్నారు.

అల్లవరం: బోడసకుర్రు పల్లిపాలెంలో 40మత్స్యకారుల ఇళ్లు వరద నీటిలో చిక్కుకున్నాయి. గోపాయిలంక, రెబ్బనపల్లి ప్రాంతాలను వరద నీరు చుట్టుముట్టింది. తహసీల్దారు బి.సునీల్‌కుమార్, ఎంపీడీవో కృష్ణమోహన్ బోడసకుర్రులో పడవలపై వరద ప్రాంతాలను పరిశీలించారు. బాధితులను పునరావాస కేంద్రానికి తరలిరావాలని కోరారు. పల్లిపాలెం యూపీ పాఠశాలలో పునరావాస కేంద్రంలో 350మంది బాధితులకు మంగళవారం రాత్రి నుంచి భోజనాలు ఏర్పాటు చేశారు. గజ ఈతగాళ్లు, లైఫ్‌జాకెట్లు సిద్ధం చేశామని ఎఫ్‌డీవో అశ్వనిసత్య తెలిపారు. డీఎల్పీవో బొజ్జిరాజు, విద్యుత్ శాఖ ఏఈ బి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఈవోపీర్డీ ఎస్వీవీ సత్యనారాయణ, ఆర్‌ఐ మేడిద దుర్గాశ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పునరవాస కేంద్రంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కొత్తపేట: కొత్తపేట తొగరపాయను ఆనుకునిఉన్న లంక పొలాలు మంగళవారం పూర్తిగా ముంపునకు గురయ్యాయి. మునగ, అరటి, వంగ, బొప్పాయి, కూరపాదులు బీర, ఆనబ, దొండ పాదులకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో వందలాది ఎకరాల్లో పంటలు వేశామని, దిగుబడి అధిక మొత్తంలో వస్తుందనుకున్న తరుణంలో వరదలకు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

మామిడికుదురు: గోదావరికి వరద పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. అప్పనపల్లి కాజ్‌వేపై వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిపివేసినట్లు తహసీల్దారు ఎం.మేరికమ్మ తెలిపారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల ప్రజలు అప్పనపల్లి ఉచ్చులవారిపేట మీదుగా రాకపోకలు సాగించాలని తహసీల్దార్ సూచించారు. పెదపట్నం నుంచి రైతులు పశుగ్రాసాన్ని పడవలపై తెచ్చుకుంటున్నారు.

పెదపట్నం మధ్యలంకలో చిక్కుకున్న మూగజీవాలు

పెదపట్నం మధ్యలంకలో 14మూగజీవాలు వరద ప్రవాహంలో చిక్కుకున్నాయి. వాటిని బయటకు తీసుకురావడానికి రైతులు ప్రయత్నం చేసినప్పటికి సాధ్యం కాలేదు. తహసీల్దార్ మేరికమ్మ రెండు ఇంజన్‌పడవలను ఏర్పాటు చేసి వాటిని బాహ్యప్రపంచంలోకి తీసుకువచ్చారు. వరద దృష్ట్యా భక్తులు బాలబాలాజీస్వామి దర్శనాలను వాయిదా వేసుకోవాలని సహాయ కమిషనర్ డి.మాధవి తెలిపారు. వరద ప్రభావిత గ్రామాల్లోని ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని అమలాపురం ఆర్డీవో కెశవర్ధనరెడ్డి పేర్కొన్నారు. పెదపట్నం, పెదపట్నంలంక, అప్పనపల్లి, పాశర్లపూడి గ్రామాలను మంగళవారం ఆయన సందర్శించారు. తహసీల్దార్ మేరికమ్మ, ఎస్‌ఐ పి.సురేష్, ఆర్‌ఐ అలీ ఉన్నారు.

రాజోలు: భారీగా వర్షాలకు రాజోలు వశిష్ఠ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. రాజోలు పుష్కరాల రేవు వద్దకు వరద నీరు భారీగా చేరుకుంది. ప్రక్కనే ఉన్న పార్కు వద్దకు వరద నీరు భారీగా చేరుకుంది. స్థానిక కాటన్ పార్కు మునకకు గురై కైలాశభూమిని వరద నీరు తాకింది. సోంపల్లి పుష్కరాల రేవు వరద నీటిలో మునిగింది. వరదను చూసేందుకు ప్రజలు వస్తున్నారు. ఏటిగట్టుపై ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. తాటిపాకలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన నారుమడులను, ముంపునకు గురైన వరి చేలను ఏఎన్జీఆర్ఏయూ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పీవీ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. నారుమడి ఐదు రోజులు కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. టి.శ్రీనివాస్, ఎం.నందకిశోర్, మధుకుమార్ పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: గోదావరి వరద ఉధృతి పెరుగుతుండడంతో నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు బెంబేలెత్తుతున్నారు. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలకు నీరు చేరడంతో ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి. అరటి, కూరగాయ పంటలు పలు చోట్ల వరద నీటిలో మునిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరద ఉధృతి పెరుగుతుండటంతో నదీ పరివాహక ప్రాంతాలు కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, పల్లపులంక, అద్దంకివారిలంక, తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు పంట పొలాలకు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వెదురుమూడి, వల్లూరు, అంగర తదితర గ్రామాల్లో వరి పొలాలు పూర్తిగా మునిగిపోయ్యాయి. నాట్లు పలుచోట్ల ముంపు నుంచి తేరుకున్నప్పటికీ ఎందుకూ పనికిరాకుండా పోయ్యాయన్నారు. రెండోసారి వరినాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో మరింత అప్పులు చేయాల్సి వస్తుందన్నారు.

ఆలమూరు: గోదావరి ఉగ్ర రూపం దాల్చింది. జొన్నాడ వద్ద నిండు గోదావరి ప్రవాహాన్ని తిలకించడానికి వచ్చిన జనం పూజలు చేస్తున్నారు. గోదావరి ఉధృతి కారణంగా నది మధ్యలో ఉన్న బడుగువానిలంకకు మరింత ప్రమాదం ఉంది. మడికి, బడుగువానిలంక, చొప్పెల్ల, చెముడులంక, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంకభూముల్లోని వాణిజ్య పంటలు ఇప్పటికే నీటమునిగాయి. జొన్నాడ వద్ద పుష్కరాల రేవు వరద నీటిలో మునిగిపోయింది. మూలస్థానం గ్రామానికి దగ్గరగా ఉన్న తోకలంక జలదిగ్బంధంలో చిక్కుకుంది. అక్కడ నివసిస్తున్న వారినిసురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేపట్టారు. ప్రస్తుతానికి పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. ఆలమూరు, పెనికేరు, గుమ్మిలేరు, చొప్పెల్ల, మోదుకూరు, పినపళ్ల, చింతలూరు, పెదపళ్ల గ్రామాల్లో వరినాట్లు ముంపునకుగురయ్యాయి. ఐదు రోజులు నీటిలో ఉండిపోవడంతో నారు పూర్తిగా పాడైపోయింది.

అంతర్వేది: టెక్కిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక వరద ప్రాంత గ్రామాల్లో నివసిస్తున్న వారు వరద ఉధృతి కారణంగా పునరవాస కేంద్రాలకు తరలిరావాలని అధికారులు కోరారు. పడవలను ఏర్పాటు చేశామని, వైద్య, తాగునీరు, సదుపాయాలు లంక ప్రజలకు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. తహసీల్దారు పెద్దిరాజు, ఎంపీడీవో సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు బాస్కర్, ఎస్‌ఐ ఎస్.రాము, ఏపీవో నాగప్రసాద్, ఏపీఎం కె.విజయ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: మండలంలోని గౌతమివశిష్ట పాయలకు వరద నీరు పోటెత్తడంతో నదీ పరివాహకంలోని పంటపొలాలు వరద ముంపులో చిక్కుకున్నాయి. ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, గోపాలపురంల్లోని లంక పొలాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఉద్యానవన పంటలు ముంపులో చిక్కుకున్నాయి.

కేంద్ర బడ్జెట్‌పై నాయకుల హర్షం

మలికిపురం, జూలై 23: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాధాన్యం కల్పించడంపై బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా మోదీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులు, యువత, మహిళలకు ప్రాధాన్యమిచ్చారన్నారు. ఉద్యోగం, స్కిల్, ఎంఎస్ఎం, ఈ-వ్యవసాయం, అర్బన్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై పూర్తి దృష్టి పెట్టారని కొనియాడారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రాయవరం: 2024 ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించడం ద్వారానే ఆంధ్రప్రదేశ్ దశ దిశ మారిందని మాజీ ఎమ్మెల్సీ వీవీవా చౌదరి (కూర్మాపురం అబ్బు) అన్నారు. మంగళవారం కూర్మాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బ్రాండ్ ఇమేజ్, సామర్థ్యం, బీజేపీతో సత్సంబంధాలతో రాష్ట్రం మళ్లీ ప్రగతి పట్టాలపై ప్రయాణం సాగిస్తుందన్నారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15వేల కోట్లు ప్రకటించడం రాష్ట్ర పురోగతికి దోహదపడుతుందన్నారు. పోలవరం నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు సహకరిస్తామని, పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామని వెల్లడించడం శుభపరిణామన్నారు.

అమరావతి నిర్మాణానికి కేంద్రం రూ.15వేల కోట్లు కేటాయించడం ద్వారా ఏపీ ప్రజల కలల రాజధాని సాకారమవుతుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు అన్నారు. లొల్ల గ్రామంలో ఆయన మాట్లాడుతూ ఏపీకి ప్రధాని నరేంద్ర మోదీ పెద్దపీట వేయడం ద్వారా గతంలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి కేంద్రం అన్ని విధాలా సహాయం అందిస్తుందని, భవిష్యత్‌లో మరిన్ని నిధులు కేటాయించడం ద్వారా రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

అంబాజీపేట: కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నిధులు కేటాయించడంలో సీఎం చంద్రబాబు ఎనలేని కృషిచేశారని నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయన్నారు. అమరావతికి రూ.15వేలు కోట్లు కేటాయించి, ఇంకా రాజధానికి నిధులు ఇస్తానని హమీ ఇవ్వడం, పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తిచేయడానికి నిర్ణయించడం, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తానని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్ర అభివృద్ధికి రూ.15వేల కోట్లు కేటాయించడం హర్షణీయమని విద్యా వేత్త బోనం గోపాలకృష్ణ అన్నారు. అమరావతి నిర్మాణానికి, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయింపు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమకు అదనపు నిధులు కేటాయింపు, విశాఖ, చెన్నై, ఓర్వకొల్లు, హైదరాబాదు హైవే రోడ్లు, ఇండస్ట్రీయల్ క్యారిడర్‌గా ప్రోత్సహించడం ఎంతో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర విభజన చట్టాన్ని అమలుచేసి రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయడం అభినందనీయమన్నారు.

మండపేట: ఏపీకి కేంద్రం వరాల జల్లు కురిపించిందని టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి అన్నారు. అమరావతి రాజధానికి రూ.15వేలకోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. నిధులువచ్చేలా కృషిచేసిన సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అమరావతికి కేంద్రం రూ.15వేలకోట్లుకేటాయించడంపై బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందన్నారు. నిధులు కేటాయించిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రికి అభినందనలు తెలి పారు.

కొత్తపేట: 2047 వికసిత్ భారత్ లక్ష్యంగా 13వ సార్వత్రిక బడ్జెట్ ఏపీకి వరాల జల్లు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం అన్నారు. ఏపీ విభజన చట్టాలకు అనుగుణంగా అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక నిధులు కేటాయించడంపై ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు పాలూరి కృతజ్ఞతలు తెలిపారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): కేంద్రబడ్జెట్‌లో అమరావతి రాజధానికి రూ.15వేల కోట్లు నిధులు కేంద్ర ప్రభుత్వం కేటాయించడం పట్ల బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇళ్ల వెంకటేశ్వరరావు హర్షం ప్రకటించారు. విజభన చట్టంలో పేర్కొన్నట్లు ఉత్తరాంధ్ర, రాయలసీమలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు, పోలవరానికి నిధులు కేటాయింపుపై పూర్తిహమీ, పారిశ్రామిక కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు కేటాయించడంపై ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుకమేటలు తొలగించి రామేశ్వరం మొగ ప్రారంభం

అల్లవరం, జూలై 23: కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు డ్రైనేజీ శాఖ ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం శివారు రామేశ్వరం మొగలో ఇసుక మేటలు తొలగించడంతో ముంపునీరు మంగళవారం నుంచి దిగడం ప్రారంభమైంది. మొగద్వారా వాసాలతిప్ప పంచనది డ్రెయిన్ల నుంచి ముంపునీరు నేరుగా వేగంగా సముద్రంలో కలుస్తోంది. డ్రెయిన్స్ డీఈఈ ఎంవీవీ కిషోర్, ఏఈ డి.సునీత మంగళవారం రామేశ్వరం మొగను పరిశీలించారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం, జూలై 23: వరద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ఎం.దుర్గారావు ఆదేశించారు. లంకాఫ్‌ఠాణేలంక, కూనాలంక, గురజాపులంకలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. గర్భిణులు, మంచానికి పరిమితమైన వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.శ్రీపూజ, సీహెచ్‌వో కృపాబాయి, టీహెచ్ ఎస్.విమలకుమారి, హెల్త్‌సూపర్‌వైజర్లు, జి.శ్రీనువాసులు, ఎం.శాంతకుమారి, ఏఎన్ఎంలు సునీత, లలిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో పశువులకు టీకాలు

ముమ్మిడివరం,జూలై 23: ముమ్మిడివరం, ఐపోలవరం మండలాల్లో వరద ప్రభావిత గ్రామాల్లో 10వేలు పాడిపశువులకు టీకాలు వేసేందుకు చర్యలు తీసుకున్నామని గోపాలకృష్ణ తెలిపారు. గురజాపులంకలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. వర్షాలు, వరదల్లో తడిసిన పశువులకు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశుగ్రాసం కొరత ఏర్పడటంతో, ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. పశుసంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అవుట్‌ఫాల్ స్లూయిస్‌కు రక్షణ

మలికిపురం, జూలై 23: పెదతిప్ప వద్ద అవుట్‌ఫాల్ స్లూయిస్ నుంచి వరద నీరు లోతట్టు ప్రాంతాలకు రాకుండా ఇసుక బస్తాలతో రక్షణ చర్యలు ఏర్పాటు చేశారు. తలుపులు పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ అనితకుమారి తెలిపారు. దిండి, రామరాజులంకలలో వరదతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దిండి-రామరాజులంక ప్రాంతాలను ఎంపీపీ ఎంవీ సత్యవాణితో కలిసి సందర్శించారు. దిండిలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

స్వల్పకాలిక వంగడాలతో మళ్లీ సాగుకు సిద్ధంకండి

ఉప్పలగుప్తం, జూలై 23: వర్షాలకు నీట మునిగి దెబ్బతిన్న సార్వా పొలాలను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం డైరెక్టర్ పీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. గొల్లవిల్లిలో ముంపులో సార్వా నాట్లు దెబ్బతిన్న పరిస్థితిని రైతులు అరిగెల నానాజీ, అడబాల సత్యనారాయణ వివరించారు. నష్టాన్ని పూడ్చుకోవడానికి స్వల్పకాలిక వంగడాలతో తిరిగి సార్వా సాగు చేసుకోవాలని డైరెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 85వేల ఎకరాల్లో వరినాట్లు వేశారని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు తెలిపారు. వరి నాట్లు ముంపులో ఉన్నాయని, పూర్తిగా దెబ్బతినలేదని వ్యాఖ్యానించారు.

హాస్టల్స్ పనితీరుపై నిరంతర నిఘా

ఆలమూరు, జూలై 23: హాస్టల్స్ పనితీరుపై నిరంతర నిఘా నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ నిబంధనల మేరకు పనిచేయాల్సిందేనని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి పేర్కొన్నారు. ఆలమూరు ప్రభుత్వబాలుర హాస్టల్‌ను మంగళవారం రాత్రి ఆమె తనిఖీచేశారు. జిల్లాలోని హాస్టళ్లలో వార్డెన్ల కొరత ఉండటంతో ఒక్కో అధికారికి రెండు, మూడు హాస్టళ్ల బాధ్యతలు అప్పగించాల్సి వస్తోందన్నారు.రికార్డులను పరిశీలించారు.ఆలమూరు హాస్టల్ వార్డెన్ సూర్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

విద్యా కిట్లు పంపిణీ

కె.గంగవరం, జూలై 23: కె.గంగవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం అన్నారు. మంగళవారం పాఠశాల విద్యార్థులకు ఆయన విద్యాకిట్లు పంపిణీ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 4,161మంది విద్యార్థులకు విద్యాకిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇక్కడ నుంచి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, సర్పంచ్ కోటి లక్ష్మినరసమ్మ వెంకట్రావు, విద్యా కమిటీ చైర్మన్ వల్లి వరలక్ష్మిశ్రీనివాసు, కూటమి నాయకులు నేమాని అబ్బు, అల్లూరి దొరబాబు, గన్ని శ్రీనివాసు, తుమ్మలపల్లి దుర్గారావు, పెంటపాటి దుర్గామల్లేశ్వరరావు, పెంటపాటి లోవప్రసాద్, పెంటపాటి వీరబాబు, పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్లు తనిఖీ చేసిన ఎస్పీ

ఆత్రేయపురం/రావులపాలెం, జూలై 23: ఆత్రేయపురం, రావులపాలెం పోలీస్ స్టేషన్లను ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ కేవీ రమణ, సీఐలు రామ్‌కుమార్, జేమ్సరత్నప్రసాద్, ఎస్‌ఐ శ్రీనివాస్ ఉన్నారు.



ఆత్రేయపురంలో స్టేషన్‌లో తనిఖీలు

కొత్తపేట: కొత్తపేట స్టేషన్‌ను ఎస్పీ బి.కృష్ణారావు మంగళవారం సందర్శించారు. పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ నిర్వహణపై ఆరా తీశారు. సాధారణ తనిఖీల్లో భాగంగానే సందర్శించేందుకు వచ్చానని ఎస్పీ తెలిపారు.డీఎస్పీ కేవీరమణ, సీఐ రామకుమార్, ఎస్‌ఐ జ్వాలాసాగర్ ఉన్నారు.

విశ్వకర్మ లబ్ధిదారుల సమాచారం పంపండి

ద్రాక్షారామ, జూలై 23: విశ్వకర్మ లబ్ధిదారుల సమాచారం పంచాయతీల వద్ద ఉంటే వెంటనే కేంద్ర ప్రభుత్వానికి అందజేయాలని పంచాయతీ కార్యదర్శులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూడల శంకర నారాయణ కోరారు. పంచాయతీ లాగిన్‌కు ఎంతమంది దరఖాస్తు చేసుకుంటే అంతమంది పేర్లు ప్రభుత్వానికి పంపాలని కోరారు. తప్పుఒప్పులుంటే శిక్షణలో తిరస్కరిస్తారన్నారు.ఆన్‌లైన్‌చేయించుకున్న వారు పంచాయతీలకు వెళ్లనవసరం లేదన్నారు.

గోదావరి కరకట్ట పునర్నిర్మించాలి

కె.గంగవరం,జూలై23: బలహీనంగా గోదావరి కరకట్టను పునఃనిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోట శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరపడంతో కరకట్ట బలహీనపడిందన్నారు. మంగళవారం ఆయన గోదావరి ఉధృతిని, సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టును పరిశీలించారు. పార్టీ అధ్యక్షుడు దొంగ ఉదయ్ కుమార్, సురేష్, శివయ్య, నాగేశ్వరరావు, వాసంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఆకుల జన్మదిన వేడుకలు

రావులపాలెం, జూలై 23: టీడీపీ సీనియర్ నాయకుడు, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. గోపాలపురంలో రామకృష్ణ స్వగృహానికి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు చేరుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేక్‌కట్ చేశారు.

నరసింహస్వామిని దర్శించుకున్న హీరో నిఖిల్



అంతర్వేది, జూలై 23: అంతర్వేది లక్ష్మినరసింహస్వామి ఆలయానికి ప్రముఖ హీరో నిఖిల్ మంగళవారం చేరుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం అర్చకులు నిఖిల్‌కు వేద ఆశీర్వచనం అందించారు. అనంత రం తాను హీరోగా చేసిన స్వయం భూ చిత్రం రిలీజ్‌కు సిద్ధంగా ఉందన్నారు.

డ్వాక్రా మహిళలకు ఇబ్బంది లేకుండా చర్యలు

మలికిపురం, జూలై 23: డ్వాక్రా మహిళలకు బ్యాంకుల్లో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని కెనరా బ్యాంకు ఎండీ కలిదిండి సత్యనారాయణరాజు హమీ ఇచ్చినట్టు పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు తెలిపారు. బెంగుళూరులోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఎండీని తాను కలిసి పలు సమస్యలు వివరించినట్టు రుద్రరాజు తెలిపారు. డ్వాక్రా రుణాలు తీసుకునే మహిళలకు ఖాతా పుస్తకాలు ఇవ్వకపోవడం కూడా ఇబ్బంది పడుతున్నారని, ప్రతి జిల్లాకు ఒక ఏజీఎం కార్యాలయం ఏర్పాటుచేయాలని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. మహిళలకు బ్యాంకు లావాదేవీల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తానని ఎండీ హమీ ఇచ్చారని చెప్పారు.

వెంకన్నను దర్శించుకున్న సినీ నటుడు సత్యప్రకాష్

ఆత్రేయపురం, జూలై 23: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని మంగళవారం సినీనటుడు సత్యప్రకాష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం ఇవ్వగా అధికారులు స్వామి వారి చిత్రపటం అందజేశారు. ఏలూరు అభయ ఆంజనేయ భజన సమాజం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు.

నదురుబాదలో ఆధార్ క్యాంపు

రాయవరం, జూలై23: నదురుబాదలో మంగళవారం అధికారులు మొబైల్ ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఆపరేటర్ ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆధార్ కార్డు లేనివారికి ఆధార్‌నమోదు, ఆధార్‌కార్డు ఉన్నవారికికార్డు అప్‌డేషన్ చేపట్టారు. ఈనెల27వరకు మండలంలోని మిగిలిన 11గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామని మండల పరిషత్ ఏవో శ్రీనివాస్ తెలిపారు.

టీడీపీపై బురద జల్లడం మానుకోవాలి

మామిడికుదురు, జూలై 23: మాజీ సీఎం జగన్ టీడీపీపై బురద జల్లడం మానుకోవాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పేర్కొన్నారు. మగటపల్లి ఆయన నివాసంలో మైనార్టీనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్నాడు జిల్లా వినుకొండలో హత్యకు గురైన రషీద్ విషయంలో జగన్, ఆయన అనుచరులు టీడీపీపై బురదజల్లడాన్ని ఖండించారు.

ఉపాధ్యాయ సమస్యలపై దశలవారీ ఆందోళన

అమలాపురం టౌన్, జూలై 23: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళనకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు యూటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ పేర్కొన్నారు. అమలాపురంలో జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన యూటీఎఫ్‌జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెం.117 రద్దు చేస్తామని, రెండు మీడియాలను పునరుద్ధరిస్తామని చెప్పినా ఇప్పటివరకు స్పష్టత లేదన్నారు.

వీడిన మిస్సింగ్ మిస్టరీ

కె.గంగవరం, జూలై23: 2022మార్చి 3న నమోదైన ఇద్దరు బాలల అదృశ్యం కేసును ఛేదించినట్లు పామర్రు ఎస్‌ఐ జానీబాషా చెప్పారు. కె.గంగవరానికి చెందిన పెద్దింశెట్టి సత్యనారాయణ కుమార్తె వాగ్దేవి(11), కుమారుడు ప్రవీష్ (9) పాఠశాలకు వెళ్లి తిరిగిరాలేదని 2022 మార్చి 3న పామర్రు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్‌ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేశారు. ఈకేసును ఇప్పుడుచాలెంజ్‌గా తీసుకునిసాంకేతిక పరిజ్ఞానంతో ఆచూకీ కనుగొన్నారు. ఇద్దరు పిల్లలను తల్లి దుర్గా భవానిమహలక్ష్మి పాఠశాల నుంచి హైదరాబాద్ తీసుకెళ్లింది. అక్కడ పనిచేసుకుని పిల్లలను పోషిస్తుంది. భార్యభర్తలు మనస్పర్ధలతో వీడిపోయారు. ఇప్పుడు పిల్లలు, తల్లిని, ఇక్కడకు తీసుకు వచ్చామని, పెద్దలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఆబోతుకు అంత్యక్రియలు

పి.గన్నవరం, జూలై 23: పోతవరం శివారు గణేష్‌నగర్‌లో రెండు ఆబోతులు కొన్ని గంటలు పాటు కొట్లాడుకున్నాయి. దీంతో ఒక ఆబోతు మృతి చెందింది. మృతి చెందిన బోతుకు సర్పంచ్, వడలి కొండయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు శాస్త్రయుక్తంగా ప్రత్యేక పూజలు చేసి అనంతరం ఖననం చేశారు. 11వ రోజున పురోహితుల సూచనలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అంబాజీపేట, జూలై 23: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. అంబాజీపేటకు చెందిన పితాని సూర్యనారాయణ, పితాని రామకృష్ణ మోటార్‌సైకిల్‌పై కొత్తపేట నుంచి అంబాజీపేట వైపు వస్తున్నారు. పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో వారు గాయపడ్డారు.

దస్తావేజు లేఖరి మృతికి సంతాపం

అంబాజీపేట, జూలై 23: నరేంద్రపురానికి చెందిన లేఖరి కాజులూరి సత్యనారాయణ సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన మృతికి అంబాజీపేట దస్తావేజు లేఖర్ల సంఘం సంతాపం వ్యక్తం చేసింది. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడి అరెస్టు

మామిడికుదురు, జూలై 23: మహిళపై అత్యాచారానికి ప్రయత్నించిన నిందితుడిని అరెస్టుచేసినట్టు నగరం ఎస్‌ఐ పి.సురేష్ తెలిపారు. పాశర్లపూడిలోని కైకాలపేటకు చెందిన మహిళ వంట గదిలో దుస్తులు మార్చుకుంటుండగా గెడ్డం సత్యనారాయణమూర్తి (వరుసకు మరిది) అత్యాచారం చేయడానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో అతడు పరారయ్యాడు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

కపిలేశ్వరపురం,జూలై23: వెదురుమూడిశ్రీషిర్డీసాయి రైస్‌మిల్లులో ఆదివారం రాత్రి 80వేలు విలువైన 8మో టార్లు చోరీకి గురైనట్లు మిల్లు నిర్వాహకులు పుట్టా కృష్ణమూర్తి ఫిర్యాదు చేశారు. ఈకేసులో మండపేట మండలం ఏడిద గ్రామానికి బొచ్చ తరుణ్, కాలే సుబ్రహ్మణ్యం, గోకవరం మండలం రంపఎర్రంపాలానికి చెందిన అల్లగిరి సత్యసాయి చిట్టి గణేష్‌లను వెదురుమూడి వద్ద అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ ఎ.వరదేశి తెలిపారు. 11ఎలక్ట్రికల్ మోటార్లు, పల్సరు బైక్ స్వాధీనం చేసుకుని, నిందితులను ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపర్చినట్లుతెలిపారు.